


మనం
కడప | అన్నమయ్య

# ప్రజల మధ్యే... ప్రజల సమస్యల పరిష్కారం

**ప్రజా దర్బార్ నిర్వహించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**

చిన్నమండెం ఆగస్టు 10(మనం న్యూస్)
చిన్నమండెం మండలం పడమటి కోన గ్రామం బోరెడ్డిగారి పల్లెలోని తన స్వగృహంలో ప్రజాదర్బార్ నిర్వహించిన లిఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, అభ్యర్ధనలు, అవసరాలను స్వయంగా వింటూ... ప్రతి ఒక్కరి మాటకు ప్రాధాన్యతనిస్తూ, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
ప్రజల దగ్గరకు వెళ్లడం మాత్రమే కాదు... ప్రజల మాటను స్వయంగా విని, పరిష్కారం దిశగా అడుగు వేయడమే



నిజమైన ప్రజాసేవ. ప్రజల మధ్య... ప్రజల కోసం... ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా – మండిపల్లి మార్క్!













# పేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్

**తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు**

**28,51,050 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు**

రాజంపేట ఆగస్టు 10(మనం న్యూస్) : అనారోగ్యంతో బాధపడే వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక ఆపన్న హస్తమని నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయం నందు అనారోగ్యంతో బాధపడుతున్న 41 మందికి దాదాపు ?28,51,050 మరియు 3 ఎల్ఓసి చెక్కులను సీఎంఆర్ఎఫ్ చెక్కులను జగన్ మోహన్ రాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జగన్ మోహన్ రాజు .తెలియజేసారు. అదేవిధంగా అయన మాట్లాడుతూ ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రిలో కూడా పేదవాడు నాణ్యమైన వైద్యం పొందవచ్చునని,పేద ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా ప్రభుత్వం తక్షణమే స్పందిస్తుందని జగన్ మోహన్ రాజు తెలియజేశారు.అంతేకాకుండా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ఆశయమని,ఆపన్నులకు సీఎం సహాయనిది చెక్కులు వరమని,దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి సిఎం సహాయనిధి సాయాన్ని ముఖ్యమంత్రి మంజూరు చేస్తున్నారని చమర్తి జగన్ మోహన్ రాజు గారు తెలియజేశారు.

అంతకుముందు లబ్ధిదారులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆర్థిక సహాయం పట్ల చంద్రబాబు గారికి,నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట,నందలూరు, ఒంటిమిట్ట ప్రాంతాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య స్ఫూర్తితో.. దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా**

**అనే నేను కార్యక్రమంలో ప్రజలు, యువత, విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని పిలుపు**



కడప, ఆగస్టు 10 మనం న్యూస్
దేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రజల్లో మరింతగా చాటుతూ, దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించేలా "దేశ నిర్మాణంలో భాగస్వాములు మరియు "అనే నేను అనే కార్యక్రమాలను జిల్లాలో ఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు విస్తృతంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధీ మీనా జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని కేవలం వేడుకగా కాకుండా.. దేశం పట్ల బాధ్యత, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం అనే సంకల్పంతో జరుపుకోవాలన్నారు. ఆగస్టు 13 నుంచి 15వ తేదీ వరకు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి వద్ద, వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలతో కలిసి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఆగస్టు 14న అటవీ, ఉద్యానవన శాఖల సహకారంతో జిల్లావ్యాప్తంగా భారీ మొక్కల పెంపకం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రముఖ ప్రదేశాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండాను చేతబూని దేశ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయడం ద్వారా స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటాలని కోరారు. ఆగస్టు 14, 15 తేదీల్లో ప్రభుత్వ భవనాలు, బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ముఖ్యమైన కూడళ్లను జాతీయ రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి స్వాతంత్ర్య వేడుకల వాతావరణాన్ని మరింత శోభాయమానం చేయాలని సూచించారు.

**విద్యార్థుల్లో దేశభక్తి, బాధ్యతా భావం పెంపొందించాలి**

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో "అనే నేను" కార్యక్రమాన్ని నిర్వహించి.. విద్యార్థులు దేశ భవిష్యత్తు కోసం తాము చేయగలిగే మంచి పనులను స్వయంగా ప్రతిజ్ఞ రూపంలో తెలియజేసేలా ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. చిన్న వయసు నుంచే దేశం పట్ల బాధ్యత, సమాజం పట్ల సేవా భావం, పర్యావరణ పరిరక్షణ వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

**సామాజిక మాధ్యమాల ద్వారా దేశ నిర్మాణ సందేశం**

యువత, విద్యార్థులు, ప్రముఖులు, క్రీడాకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో "అనే నేను" సామాజిక మాధ్యమ ప్రచారంలో పాల్గొనాలని డా. నిధీ మీనా కోరారు. జాతీయ జెండాను చేతిలో పట్టుకుని "అనే నేను... దేశ అభివృద్ధి కోసం నా వంతుగా..." అంటూ 30 నుంచి 60 సెకన్ల స్వీయ వీడియోలను రూపొందించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయాలని సూచించారు 26 వంటి గుర్తింపు పదాలతో ప్రచారం చేసి, అధికారిక ప్రభుత్వ సామాజిక మాధ్యమ ఖాతాలను గుర్తించాలని కోరారు. హ్యాష్‌ట్యాగ్‌లతో, జాతీయ జెండాను చేతిలో పట్టుకుని... "అనే నేను... దేశ అభివృద్ధి కోసం నా వంతుగా..." అంటూ 30 నుండి 60 సెకన్ల సెల్ఫీ వీడియోను రూపొందించి, సోషల్ మీడియాలో పోస్ట్ చేసి @APOfficialNews పేజీని ట్యాగ్ చేయాలని పిలుపునిచ్చారు.
స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వికసిత్ భారత్--2047, స్వర్ణాంధ్ర--2047 లక్ష్యాల సాధనకు ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు.
"ఆలోచిద్దాం.. ఆచరిద్దాం.. వికసిత్ భారత్‌ను నిర్మిద్దాం" అనే స్ఫూర్తితో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి, దేశ నిర్మాణంలో మన వంతు బాధ్యతను నిర్వర్తిద్దామని జిల్లా ప్రజలకు డా. నిధీ మీనా పిలుపునిచ్చారు.

# వైసీపీ నేతల డ్రామాలను ప్రజలు చూసి నవ్వుకుంటున్నారు

**వైసీపీ పార్టీది ఫేక్ రాజకీయం**

**మీడియా సమావేశంలో కేకే చౌదరి, పంతగాని నరసింహ ప్రసాద్ ఫైర్**







రైల్వే కోడూరు, ఆగస్టు 10, మనం న్యూస్
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు పట్టణ పరిధిలోని స్థానిక టిడిపి పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ కార్యాలయంలో సోమవారం వైసీపీ పార్టీ చేపట్టిన దీక్షలను ఖండిస్తూ మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మీడియా సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖాదీ మరియు గ్రామీణ చిన్న తరహా పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి మరియు టిడిపి రాష్ట్ర సాంస్కృతి విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ నార్జాల హేమరాజ్, టిడిపి నాయకులు వార్డ్ మెంబర్ పోతురాజు నవీన్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో కేకే చౌదరి మాట్లాడుతూ మెగా డీఎస్సీపై నిరుద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ, ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్న వైసీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యేల వైఖరి చాలా హాస్యాస్పదంగా ఉందని, తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గంలో వైకాపా నాయకులు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు, ర్యాలీలను చూసి నిరుద్యోగులు, ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు.గత ఐదేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వం నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేసిందని విమర్శించారు. 2019లో అధికారంలోకి వస్తే 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ప్రతి ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్' విడుదల చేస్తామని హామీ ఇచ్చి ఏ ఒక్క డీఎస్సీ కూడా తీసుకురాకపోవడం సిగ్గుచేటన్నారు. నాడు హామీల అమలు కోసం రోడ్డెక్కిన నిరుద్యోగులు, విద్యార్థులపై తిరుపతి, కడప, విజయవాడలతో పాటు రైల్వేకోడూరులోనూ కేసులు పెట్టి జైళ్లకు పంపిన ఘనత వైకాపా ప్రభుత్వానిదేనని మండిపడ్డారు.




?విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, విద్యాశాఖ ద్వారా దాదాపు 16,000 పైచిలుకు పోస్టులతో మెగా డీఎస్సీని విడుదల చేసి చరిత్ర సృష్టించారని కొనియాడారు. మెగా డీఎస్సీని అడ్డుకోవడానికి కోర్టుల్లో దాదాపు 200కు పైగా కేసులు వేయించి కుట్రలు చేసిన వైసీపీ నాయకులకు, ఈ రోజు నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మాని వైకాపా నాయకులు నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
ఈ సమావేశంలో పంతగాని నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ అబద్ధాలు, అవినీతి హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి, అత్యంత అవినీతి పరిపాలన అందించిన వైఎస్సార్సీపీని ప్రజలు ఇప్పటికే అగాధంలోకి తొక్కేసారని, వైకాపా చరిత్రంతా అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలతో నిండిపోయిందని, ఇప్పుడు వారు పవిత్రులైనట్లు శుద్ధపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. వైఎస్సార్సీపీ ఒక "ఫేక్ పార్టీ" అని, పై స్థాయి నాయకుల నుండి కింద స్థాయి వరకు అంతా ఫేక్ ప్రచారాలే చేస్తున్నారని దుయ్యబట్టారు.
?మీరు మళ్లీ అధికారంలోకి రావడం ఒక కల,జగన్ మోహన్ రెడ్డి గారూ, మీరు మళ్లీ అధికారంలోకి వస్తామనుకోవడం కేవలం ఒక కల మాత్రమే. కుండబద్దలు కొట్టి చెబుతున్నాం, మీ వైకాపా ఇకపై అధికారంలోకి రాదు అని స్పష్టం చేశారు. డీఎస్సీ ప్రక్రియపై వైకాపా నాయకులు కావాలని ఫేక్ ప్రచారాలు చేస్తూ, లేనిది ఉన్నట్లు చూపించి అల్లజడులు సృష్టించాలని చూస్తున్నారని ఆరోపించారు.
?రైల్వే కోడూరు ర్యాలీపై సవాల్రైల్వే కోడూరులో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులు నాయకత్వంలో వైకాపా నిర్వహించిన నిరాహార దీక్షలు, నారా లోకేష్ రాజీనామా చేయాలంటూ చేపట్టిన ర్యాలీని ఆయన ఎద్దేవా చేశారు. "నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి ఎండలో నడుస్తూ కూలింగ్ గ్లాసెస్ పెట్టుకుని షోలు చేస్తున్నారు. ప గ్రామాల్లో ఉన్న కొద్దిమందిని సేకరించి, ఎండలో నడిపించారు. మీరు చెబుతున్నట్లుగా ఆ ర్యాలీలో ఉన్నవారిలో ఒక్కరైనా డీఎస్సీ బాధితులు ఉన్నారా అని మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులుకు సవాల్ విసిరారు.
?నారా లోకేష్ అభివృద్ధిని చూసి వైకాపాకు వణుకు పుట్టిందని,విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ, పేద విద్యార్థులకు నాణ్యమైన చదువు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నందుకు నారా లోకేష్ రాజీనామా చేయాలా? అని పంతగాని ప్రశ్నించారు. 16 వేలకు పైగా పోస్టులతో మెగా డీఎస్సీ ఇచ్చి ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నందుకు, పెద్ద పెద్ద కంపెనీలను రాష్ట్రానికి రప్పించి నిరుద్యోగాన్ని నిర్మూలిస్తున్నందుకే వైకాపా నాయకులకు కడుపుమంటగా ఉందన్నారు. లోకేష్ పరిపాలన స్పీడ్ చూసి వైకాపా నాయకులు వణికిపోతున్నారని, ఏం చేయాలో దిక్కు తోచక తిక్క మకలకు గురవుతున్నారంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు.
?పిచ్చి వేషాలు కట్టిపెట్టి ఒళ్లు దగ్గర పెట్టుకుని ప్రవర్తించాలని, లేకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే వైకాపా నాయకులను తరిమితరిమి కొడతారని హెచ్చరించారు. ఇకనైనా ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని హితవు పలికారు.

## గర్భిణీ మహిళలకు అండగా దాతృత్వ సేవ

పి ఎం ఎస్ ఎం ఏ కార్యక్రమానికి హాజరైన వారికి భోజన వసతి కల్పించిన ల్యాబ్ టెక్నీషియన్



చాపాడు, ఆగస్టు 10, మనం న్యూస్: చాపాడు మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పిఎంఎస్ఎంఏ) కార్యక్రమానికి హాజరైన గర్భిణీ మహిళలు, వారి వెంట వచ్చిన కుటుంబ సభ్యులు, అతిథులు, వైద్య సిబ్బందికి ల్యాబ్ టెక్నీషియన్ సుధాకర్ దాతృత్వంతో భోజన వసతి కల్పించారు. నక్కలదిన్నె పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా సేవలందించి బదిలీపై వెళ్తున్న సుధాకర్ తన సేవా కాలానికి గుర్తుగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన వారందరికీ రుచికరమైన భోజనం అందించడంతో గర్భిణీ మహిళలు, వైద్య సిబ్బంది ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి. ఓబులేసు మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే గుడ్లు, బియ్యం, పౌష్టికాహారం, చిక్కీలు తదితరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతి నెల వైద్యుల సూచన మేరకు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల ద్వారా ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించుకోవాలని సూచించారు. గర్భిణులకు అనారోగ్య సమస్యలు లేదా కాన్పు నొప్పులు వచ్చిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని చెప్పారు. ప్రసవ సమయం వచ్చినప్పుడు 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకుని ఆసుపత్రికి చేరుకోవాలని సూచించారు. ప్రసవం అనంతరం తల్లి, బిడ్డకు అవసరమైన టీకాలు వేయించడంతో పాటు కనీసం 48 గంటల పాటు ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని డాక్టర్ ఓబులేసు తెలిపారు.

## నిత్యపూజ స్వామి కోన హుండీ ఆదాయం 74 వేలు



సిద్ధవటం ఆగస్టు 10(మనం న్యూస్) :నిత్యపూజ స్వామి కోన లో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను సోమవారం లెక్కించగా 74,767/- ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ సురేష్ కుమార్ రెడ్డి చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 29.06.2026 నుండి 10.08.2026 వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వృషభ చలేశ్వర స్వామి దేవస్థానము, వేంపల్లి, కార్యనిర్వహణాధికారి కె .సుభాష్,సిద్ధవటం పోలీస్ సిబ్బంది , ఆలయ అర్చకులు సుబ్రమణ్యం శర్మ, సిబ్బంది చంద్ర,వంతాటి పల్లి గ్రామ ప్రజలు,భక్తులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్సీపీ నిరసనలు

తల్లెం భరత్ కుమార్ రెడ్డి



తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం లో నిర్వహించిన ర్యాలీ లో భాగంగా మెగాడీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైఎస్సార్సీపీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా 4వ రోజు చేపట్టిన నిరసనల్లో భాగంగా వైస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ తల్లెం భరత్ కుమార్ రెడ్డి నల్ల కండువాలు వేసుకొని నిరసన ర్యాలీ సాగించారు. ఈ సందర్భంగా తల్లెం భరత్ కుమార్ రెడ్డి మీడియా తో మాట్లాడుతూ, నిరుద్యోగుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని మండిపడ్డారు. డీఎస్సీలో జరిగిన అక్రమాలపై తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో నిరుద్యోగులను వెంటేసుకుని ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువకులు, మహిళలు, నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 13 న మండల సర్వసభ్య సమావేశం

సిద్ధవటం, ఆగస్టు 10 మనం న్యూస్ : మండల కేంద్రమైన సిద్ధవటం ఎంపీపీ సభా భవనంలో 13న ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో ఫణి రాజకుమారి తెలిపారు ఈ సందర్భంగా ఆమె మండల కేంద్రమైన సిద్ధవటం లో తన కార్యాలయంలో మాట్లాడుతూ మండల సభ సభ సమావేశానికి మండల అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, సింగిల్ విండో అధ్యక్షులు ఎంపీటీసీలు, జడ్పిటిసి ప్రతి ఒక్కరు సమావేశానికి హాజరు కావాలని అధికారులు 90 రోజుల ప్రగతి నివేదిక తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు

# అప్పుడు గర్జించిన ఉద్యోగ సంఘాలు.. ఇప్పుడు గప్‌చుప్ ఎందుకు? పీఆర్సీపై స్పష్టత ఏదీ?

### ఐదు డీఏలు పెండింగ్.. ఉద్యోగుల్లో అసంతృప్తి కూటమి ప్రభుత్వం అంటే ఉద్యోగస్తులకు వణుకు




పుల్లంపేట ఆగస్టు 10 (మనం న్యూస్)ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై గతంలో ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ఉద్యమాలు చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు.. ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నాయనే ప్రశ్నలు ఉద్యోగ వర్గాలతో పాటు ప్రజల్లోనూవినిపిస్తున్నాయి. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లకు పైగా గడిచినా పీఆర్సీ కమిషన్ ఏర్పాటు కాకపోవడం, గతంలో ఏర్పాటు చేసిన పీఆర్సీ ప్రక్రియపై స్పష్టత లేకపోవడం, డీఏలు పెండింగ్‌లో ఉండటంపై ఉద్యోగుల్లోఆందోళనవ్యక్తమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో పీఆర్సీ, డీఏలు, సీపీఎస్ తదితర అంశాలపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా స్పందిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చాయి. అప్పట్లో ప్రభుత్వ విధానాలను తప్పుబడుతూ వరుసగా నిరసనలు, ఆందోళనలు నిర్వహించిన సంఘాలు.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో అదే స్థాయిలో ఎందుకు ప్రశ్నించడం లేదని కొందరు ఉద్యోగులు,ప్రజలునిలదీస్తున్నారు. ప్రభుత్వం మారితే డిమాండ్ల తీవ్రత కూడా మారిపోతుందా?" అనేప్రశ్నప్రస్తుతంచర్చనీయాంశంగా మారింది. ఉద్యోగుల సమస్యలు ఏ ప్రభుత్వం ఉన్నా ఒకే విధంగా ఉండాలని, రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా ఉద్యోగ సంఘాల పోరాట వైఖరి మారకూడదని పలువురుఅభిప్రాయపడుతున్నారు. పీఆర్సీ ఎప్పుడు? డీఏల పరిస్థితి ఏమిటి?పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా వేతన సవరణ కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. పీఆర్సీ కమిషన్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిర్ణయం కోసం ఉద్యోగసంఘాలు ఎదురుచూస్తున్నాయి. మరోవైపు పెండింగ్‌లో ఉన్న డీఏల విడుదలపై కూడా ఉద్యోగుల్లో నిరీక్షణ కొనసాగుతోంది.

ఇటీవల జరిగిన ఆర్థిక అంశాలపై ఉన్నతస్థాయి సమావేశాల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వనరుల లభ్యత, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై చర్చ జరిగిన నేపథ్యంలో ఉద్యోగుల డిమాండ్లకు ప్రభుత్వం ఎంతవరకు ప్రాధాన్యత ఇస్తుందన్నది ప్రశ్నగా మారింది.

ఉద్యోగుల ఆశలపై ఆర్థిక పరిస్థితి ప్రభావంరాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశించిన స్థాయిలో లేకపోవడం, వివిధ పథకాల అమలుకు భారీగా నిధులు అవసరమవుతున్న నేపథ్యంలో ఉద్యోగుల వేతన సంబంధిత డిమాండ్లను ప్రభుత్వం ఏ విధంగా పరిష్కరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

ఒకవైపు పీఆర్సీకోసంఉద్యోగులు ఎదురుచూస్తుండగా.. మరోవైపు డీఏ బకాయిలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలపై స్పష్టత కోసం ఆశిస్తున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాలు ప్రభుత్వంపైనిరంతరం ఒత్తిడితీసుకురావాలనిఉద్యోగుల్లోని ఒక వర్గం కోరుతోంది.

"గతంలో ఏం చేశాం.. ఇప్పుడు ఏం చేస్తున్నాం?"ఉద్యోగ సంఘాల పోరాట చరిత్రను, ప్రస్తుత వైఖరిని పోల్చుకుంటూ ఉద్యోగులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వాన్ని ప్రశ్నించిన తరహాలోనే ప్రస్తుత ప్రభుత్వాన్ని కూడా ఉద్యోగుల హక్కుల కోసం ప్రశ్నించాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు. అయితే ప్రభుత్వం త్వరలో పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి, ఉద్యోగుల పెండింగ్ డీఏలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలపై సానుకూలనిర్ణయంతీసుకుంటుందా? లేక ఆర్థిక పరిస్థితుల పేరుతో మరింత కాలయాపన చేస్తుందా? అన్నది వేచి చూడాల్సిందే. ఉద్యోగ సంఘాలు తమ హక్కుల కోసం గళమెత్తుతాయా? లేక ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తూ ఉంటాయా? అనేది రానున్న రోజుల్లో తేలనుంది.

# మేగా డీఎస్సీపై, అసెంబ్లీ రావాలని సవాల్ విసిరిన, టీడీపీ నేత ఎద్దల సాగర్

నందలూరు ఆగస్టు 8(మనం న్యూస్)
2025 మేగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న విమర్శలకు, రాజపేట అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు, ఎద్దల విజయ సాగర్ తీవ్రంగా స్పందించారు. మేగా డీఎస్సీ విషయంలో ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగాలను సాధించేందుకు కృషి చేస్తోందని, గత ప్రభుత్వ హయాంలో డీఎస్సీకి సంబంధించిన అంశాలను పట్టించుకోలేదని, గాలికి వదిలేసి ఇప్పుడు దొంగ దీక్షలు ఎఙూ వారి పార్టీ మైలేజ్ కోసం నిరుద్యోగులతో ఆటలాడుతున్నారు,అని సాగర్ విమర్శించారు. ఎద్దల విజయ సాగర్ మాట్లాడుతూ.. "2025 మేగా డీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేస్తూ, కట్టబెట్టిన ఉద్యోగాలను సాధించిన ఉపాధ్యాయులను అవమానించవద్దు.అని దమ్ముంటే డీఎస్సీపై వచ్చే అసెంబ్లీలో చర్చకు రావాలి" అని జగన్‌కు సవాల్ విసిరారు. డీఎస్సీపై ఎలాంటి అనుమానాలు ఉన్నా అసెంబ్లీలో చర్చించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. మరో వైపు మేగా



డీఎస్సీపై వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం డీఎస్సీని అసలు పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాశాఖలో నియామకాలు, ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై దృష్టి పెట్టిందని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యావ్యవస్థలో ఒక విప్లవాత్మక నిరుద్యోగ సమస్య సమూల మార్పులకు చర్యలు తీసుకుంటున్నారని, చీఙూ గవర్నమెంట్ మంచి పనులు చేస్తూ ఉంటే ఓర్వలేక వైసీపీ హయాంలో నిలిచిపోయిన నియామక ప్రక్రియలను ముందుకు తీసుకెళ్తున్నారని ఎద్దుల విజయసాగర్ పేర్కొన్నారు. గతంలో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితమైన విషయాన్ని కూడా ప్రస్తావిస్తూ, మేగా డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్న వైసీపీకి ప్రజలే సమాధానం చెబుతారని అన్నారు.

మేగా డీఎస్సీ విషయంలో టీడీపీ నేత సాగర్, వైసీపీ విమర్శలను ఖండిస్తూ, ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కట్టుబడి ఉందని తెలిపారు. మరియు తొందరలో సెకండ్ ఫేస్ డీఎస్సీ నియామకాలు జరుగుతాయని నిరుద్యోగ సమస్య తీరుతుందని కొనియాడారు, ఇప్పుడు ప్రభుత్వ టీచర్లు డీఎస్సీ లో క్వాలిఫై అయిన వారిని ఒక టెన్షన్ వాతావరణం వైసీపీ వారు క్రియేట్ చేస్తున్నారు, డీఎస్సీపై చర్చకు సిద్ధమైతే వచ్చే అసెంబ్లీకి రావాలని జగన్‌కు విజయ సాగర్ సవాల్ విసిరారు.

# ఎర్రచందనం కేసులో ట్విస్ట్.. ముగ్గురు పట్టుబడ్డారా? ఒక్కరినే ముద్దాయిగా చూపించడంపై అనుమానాలు!

### 13 దుంగలు, స్కార్పియో స్వాధీనం.. మిగిలిన ఇద్దరి సంగతేంటి?
### ఫారెస్ట్ అధికారుల తీరుపై స్థానికుల ప్రశ్నలు.. సమగ్ర విచారణకు డిమాండ్

మనం న్యూస్ ఆగస్టు 10
సుండుపల్లె, వీరబల్లి: సానిపాయి ఫారెస్ట్ పరిధిలో 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఫారెస్ట్ అధికారులు ప్రకటించారు. అయితే ఈ ఘటనలో ఉదయం ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారనే సమాచారం ఉండగా, అధికారికంగా ఒక్కరినే ముద్దాయిగా చూపించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సానిపాయి ఫారెస్ట్ పరిధిలోని వీరబల్లి మండలం కొట్టేగి వాండ్లపల్లి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో అటవీ అధికారులు దాడులు నిర్వహించినట్లు సానిపాయి ఫారెస్ట్ రేంజర్ వై.సి. రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో 13 ఎర్రచందనం దుంగలు, ఏపీ 26 ఏఎన్ 7119 నంబర్ గల స్కార్పియో వాహనాన్ని స్వాధీనం చేసుకుని, గాలివీడు మండలం తూముకుంటకు చెందిన తోట వెంకటాద్రిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ.2,10,647 ఉంటుందని అధికారులు వెల్లడించారు. ముగ్గురు పట్టుబడ్డారనే సమాచారంపై స్పష్టత ఎప్పుడు? అయితే ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారనే సమాచారం స్థానికంగా ఉన్నప్పటికీ, ఒక్కరినే ముద్దాయిగా చూపించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మిగిలిన ఇద్దరి



వివరాలను అధికారులు ఎందుకు వెల్లడించలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముగ్గురు వ్యక్తులు పట్టుబడినట్లు సమాచారం ఉన్నప్పుడు ఒక్క వ్యక్తిపైనే కేసు నమోదు చేయడానికి కారణం ఏమిటి? మిగిలిన ఇద్దరిని ఎందుకు కేసులో చేర్చలేదు? వారిని వదిలిపెట్టారా? అనే ప్రశ్నలకు ఫారెస్ట్ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

ఈ పరిణామాల నేపథ్యంలో సానిపాయి ఫారెస్ట్ రేంజర్ వై.సి. రెడ్డి పాత్రపై కూడా స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత ఉందో ఉన్నతాధికారులు సమగ్ర విచారణ ద్వారా తేల్చాల్సి ఉంది.

**అక్రమ రవాణా వెనుక అసలు వ్యక్తులు ఎవరు?**

మరోవైపు ఈ ఎర్రచందనం అక్రమ రవాణా వెనుక వీరబల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి హస్తం ఉన్నట్లు స్థానికంగా ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదరు వ్యక్తి గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి, ప్రస్తుతం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారంపై లోతైన విచారణ నిర్వహిస్తే ఎర్రచందనం అక్రమ రవాణా వెనుక ఉన్న అసలు వ్యక్తులు, వారికి సహకరిస్తున్న వ్యక్తుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

కాబట్టి ఉన్నతాధికారులు ఈ ఘటనపై స్వతంత్రంగా, సమగ్రంగా విచారణ చేపట్టి, ముగ్గురు పట్టుబడ్డారనే సమాచారంపై వాస్తవాలను వెల్లడించడంతో పాటు, కేసులో ఒక్కరినే ముద్దాయిగా ఎందుకు చూపించారనే అంశంపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత కలిగిన అధికారులు ఎటువంటి ఒత్తిళ్లకు, రాజకీయ ప్రభావాలకు తలొగ్గకుండా వ్యవహరించి, ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ దాడుల్లో ఎఫ్ఎస్ఓ రజిని, ఎఫ్‌బీఓ శ్రీహరి, లీల, స్ట్రైక్ ఫోర్స్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ ప్రిన్సిపాల్ మాకు వద్దు - తల్లిద్రండులు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

.కేంద్రీయ విద్యాలయ లో టీచర్ల కొరత - .వచ్చిన టీచర్లను తరిమేస్తున్న ప్రిన్సిపాల్.

పాఠశాల సౌకర్యాల కొరత – ప్రిన్సిపాల్ కు భజన చేస్తేనే ఉద్యోగం.

. ప్రిన్సిపాల్ కు ఒక రూల్, ఉపాద్యాయులు ఒకటి – సబ్ కలెక్టర్ కు నివేదిక ఇచ్చిన తల్లిదండ్రులు



నందలూరు మనం న్యూస్ ఆగస్టు 10
రాజంపేట నియోజక వర్గం లో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయం వల్ల అక్కడ విద్యార్థులకు ఒక వరం అని స్థానిక ప్రజలు అనుకున్నారు. కొన్ని రోజులు బాగా గడిచిన ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయం అంటే మాకు వద్దు అనేలా తయారు చేశారు ప్రస్తుత ప్రిన్సిపాల్ వివరాలోనికి వెళితే....రాజంపేట నియోజక వర్గంలో కేంద్రీయ విద్యాలయం కావాలని కలలు కన్న విద్యార్థులు ప్రస్తుతం మాకు వద్దు అనే స్థాయికి తీసుకెళ్లిన అక్కడి అధ్యాపక మరియు ప్రిన్సిపాల్.

**గత కొన్ని యేండ్ల నుండి ఉపాధ్యాలు కొరత**

కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసిన మొదట్లో చాలా మంచి ఆదరణ లభించిందని , కాని రాను రాను రాజు గారి గుర్రం గాడిద అయిందన్న సామెత లా తరైంది. ఇక్కడ అధ్యాపకుల కొరత మొదలు అయింది. కానీ ప్రస్తుత ప్రిన్సిపాల్ చర్యలు తీసున్న దాఖలాలు లేవు.

**కొత్తగా వచ్చిన అధ్యాపకులను తరిమేస్తున్న ప్రిన్సిపాల్**

ఈ కేంద్రీయ విద్యాలయం లో ఉన్న కొరత భర్తీ చేయడం ఒక వంతు అయితే, వచ్చిన వారిని పని చేయకుండా సాకులు చూపి తరిమివేసే పనిలో ఈ ప్రిసిపాలు ఉన్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. వచ్చిన వారి ఒక నెల కూడా సక్రమంగా పని చేయకుండా వారిని ఒత్తిడికి గురి చేసి, తనకు నచ్చిన భాష లో వారిని నోటికి వచ్చినట్లు మాట్లాడడం అతనికి పరిపాటిగా ఉందని , దాని వల్ల విద్యార్థులకు చాలా ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు.

**పాఠశాల లో సౌకర్యాల కొరత;**

కేంద్రీయ విద్యాలయం అంటే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కలిగి ఉంటాయి. దానికి భిన్నంగా రాజంపేట కేంద్రీయ విద్యాలయం ఉండడం ఆచర్యం కల్గిస్తుంది. విద్యార్థుల టాయిలెట్ సౌకర్యం కూడా సరిగ్గా లేకపోవడం ఎంతా దారుణం అయిన విషయం అర్థం కాలేదు. దాని గురించి ఒక మాట కూడా మాట్లాడానికి స్థానిక ప్రిన్సిపాల్ లేకపోవడం ఏమిటి అని అంటున్నారు.

**ప్రిన్సిపాల్ కు భజన చేస్తేనే ఉద్యోగం.**

ఈ పాఠశాల నందు ఔట్ సోర్సింగ్ పై ఉపాధ్యాయులుగా ఎంపిక అయిన ప్రిన్సిపాల్ ను ప్రసన్నం చేసుకుంటేనే బాధ్యతలు ఉంటాయి. అలా కాదని ఏదైనా ప్రశ్నిస్తే వారికి ఉద్యోగం ఉండదు. ఈ విధంగా గత ఏడాదిగా నుండి సుమారుగా పదుల సంఖ్యలో ఉపాధ్యాయులను తొలగించడం జరిగింది. ఈ మధ్య కాలంలో ఐదు మందిని తీసివేసిన ఘనుడు ఈ ప్రిన్సిపాల్ అని తల్లిద్రండులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రిన్సిపాల్ కు ఒక రూల్ ఉపాధ్యాయులకు ఒకటి.**


ఈ పాఠశాల నందు పనిచేసే ప్రిన్సిపాల్ ఒక విధమైన ధోరణి లో ఉంటాడు. అతను పాఠశాలకు రాడు, విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడాలి వస్తె నిరాకరిస్తాడు. ఏదైనా పాఠశాల వదిలి వెళ్ళిపోతారు. అదే ఉపాద్యాయులు ఏదైనా అవసరం పడి పర్మిషన్ అడిగితే రేపటి నుండి పాఠశాలకు రావద్దని హుకుం జారీ చేస్తారు, ఈ పాఠశాల అతని జాగీరా అని అతనికి ఒక ఉద్యోగి కదా అని ప్రశిస్తున్నారు.

**సబ్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన విద్యార్థుల తల్లిదండ్రులు**

సోమవారం తమ పిల్లల భవిష్యత్తు అగమ్య గోచరంగా తయారైందని మా పిల్లల చదువులకు ఇబ్బంది లేకుండా ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయుల ను తొలగించకుండా కొనసాగించాలని సబ్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. దానికి స్పందించిన పరిపాలన అధికారి పాఠశాల ప్రిన్సిపాల్ పై గతం లో కూడా తమకు పిర్యాదులు వచ్చాయని వాటిపై పరిశీలించి పై స్టాయి అధికారులకు సంచారం ఇచ్చి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# కంచర్లపాలెం ఉబ్బుకి వస్తున్న నీటితో రైతుల అవస్థలు

ఖరీఫ్ పంటలకు తీవ్ర ఆటంకం.. సమస్య పరిష్కారానికి అధికారులను కోరిన రైతులు



మైదుకూరు, ఆగస్టు 10, మనం న్యూస్:
కంచర్లపాలెం కుంట నుంచి ఉబికి వస్తున్న నీటి సమస్యను పరిష్కరించి, ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవాలని రైతు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఏవి. రమణ రాష్ట్ర ప్రభుత్వాన్ని, తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులను కోరారు.కడప జిల్లా మైదుకూరు మండలం వనిపెంట ప్రాంతంలోని ఆదిరెడ్డిపల్లె, ఓబులాపురం, చెర్లోపల్లె, పప్పనపల్లె గ్రామాల మీదుగా బ్రహ్మంసాగర్ ప్రాజెక్టుకు నీటిని తరలించే తెలుగుగంగ కాలువకు అనుబంధంగా ఉన్న కంచర్లపాలెం కుంట నుంచి ఉబికి వస్తున్న నీటితో ఆయా గ్రామాలకు చెందిన రైతులు గత పదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. దాదాపు 3 వేల ఎకరాల వ్యవసాయ భూముల్లో ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.ఈ సమస్యను ఆయా ప్రాంతాల రైతులు రైతు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఏవి. రమణ దృష్టికి తీసుకురావడంతో, సమస్య పరిష్కారం కోసం గత ఏడాది నవంబర్ నుంచి రైతులు, రైతు సేవాసమితి నాయకులతో కలిసి ఆయన దశలవారీగా తెలుగుగంగ ప్రాజెక్టు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.

రైతుల విజ్ఞప్తిపై స్పందించిన తెలుగుగంగ అధికారులు కంచర్లపాలెం కుంట వద్ద నీటి సమస్య ఉన్న ప్రాంతాన్ని రైతులు, రైతు సేవాసమితి నాయకులతో కలిసి పరిశీలించారు. సమస్యను పరిశీలించిన అధికారులు దీనికి శాశ్వత పరిష్కారం కోసం రెవెన్యూ అధికారుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.ఈ నేపథ్యంలో రైతు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఏవి. రమణ, మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి మాడిశెట్టి సహదేవుడు, రైతులు మూలే రామచంద్రారెడ్డి, పడిగెపాటి నారాయణరెడ్డి తదితరులతో కూడిన రైతుల బృందం సోమవారం ఉదయం బద్వేల్ ఆర్డీవో కార్యాలయానికి చేరుకుంది.ఆర్డీవో చంద్రమోహన్ను కలిసి కంచర్లపాలెం కుంట నుంచి ఉబికి వస్తున్న నీటి సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. తెలుగుగంగ అధికారులతో కలిసి సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి, రైతుల పంట పొలాలకు నష్టం కలగకుండా ఉబ్బునీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.రైతుల వినతిపై ఆర్డీవో చంద్రమోహన్ స్పందిస్తూ, సమస్య ఉన్న ప్రాంతాన్ని తెలుగుగంగ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించి, ఉబ్బునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తానని రైతుల బృందానికి హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. పదేళ్లుగా కొనసాగుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి, ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసుకునే అవకాశం కల్పించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# పుల్లంపేట కరివేపాకు రాచపల్లి ఎస్టి (యానాదులకు) భూములు పంచాలి

పుల్లంపేట ఆగస్టు 10 (మనం న్యూస్) తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం ఆర్ రాచపల్లిర్ (యానాదులు) మార్పు కోసం పాదయాత్రలో భాగమై పుల్లంపేట మండలంలో పుల్లంపేట తాసిల్దార్ కార్యాలయంవద్ద నాలుగు రోడ్ల కూడలిలో పాదయాత్ర మీ నిర్వహిం డమైనది. ఈసందర్భంగా ఎం జయరామయ్య వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ పుల్లంపేట మండలంలో భూములు కబ్జాకు గురవుతున్న పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారు రెవిన్యూ వారు నిర్లక్ష్యం కారణంగానే కబ్జాలుఅవుతున్నాయనిఈసందర్భంగావారుతెలియజేశారు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచాలని పల్లెల్లో మూడు సెంట్లు పట్టణాలు రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని



పేదవారికి రెండు ఎకరాలు ప్రభుత్వ భూమి ఇవ్వాలని పెరిగిన నిత్యవసర ధరలు తగ్గించాలని కల్తీ బొప్పాయి విత్తనాలు పైన అలా సప్లై చేసిన వారి మీద చర్యలుతీసుకోవాలని అన్నారు అనంతరం ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎమ్మార్వో కూడా స్పందించి అర్హులను గుర్తించి వారికి భూములు పంచుతామని బి కే యం యు నాయకుల ముందర హామీ ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో పుల్లంపేట మండలం బి కే యం యు కార్యదర్శి కృష్ణవేణి లక్ష్మయ్య ఓబులవారిపల్లి మండల అధ్యక్షులు కార్యదర్శి మల్లికా వెంకటరమణ కొమ్మిద్ది వెంకటరమణ బి కే యం యు నియోజకవర్గం నాయకులు శివకుమార్ వర్మ నాగిపోగు పెంచలయ్య మరియు బి కే యం యు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు




# యుటీఎఫ్ జెండా ప్రభుత్వ విద్యారంగానికి అండ

– ఘనంగా యుటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

పెనగలూరు(ఆగస్టు 10),మనంన్యూస్:
పెనగలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన యుటిఎఫ్ జెండా దిమ్మె పై యుటిఎఫ్ పతాకాన్ని ఎగురవేయడం జరిగింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్రనాయకులు బి. హరి ప్రసాద్, మండల అధ్యక్ష, కార్యదర్శులు పి. శ్రీనివాస కుమార్, యం. నరసింహారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్, యుటిఎఫ్ 1974 ఆగస్టు 10 కాకినాడ కేంద్రంగా ఆవిర్భవించిందని,నాటి నుండి నేటి వరకు ఉపాధ్యాయ హక్కులతో పాటు ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణ కోసం ప్రభుత్వ బడుల బలోపేతం కోసం నిరంతరం పనిచేసిన చరిత్ర కలిగి ఉన్న సంఘంగా పేర్కొన్నారు.ఉపాధ్యాయ ఉద్యమ ప్రస్థానానికి నూతన దిశానిర్దేశం చేసిందని అన్నారు. హక్కుల సాధనతో పాటు బాధ్యతల నిర్వహణ కూడా సమానంగా ఉండాలని దిశానిర్దేశం చేసిన సంఘం అని అన్నారు.ఉపాధ్యాయుడి చేతిలో భవిష్యత్ తరాల నిర్మాణం ఉందని చెప్పిన సంఘం యుటిఎఫ్ అని అన్నారు .ప్రభుత్వ పాఠశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులు ఉండాలని, మౌలిక వసతులు మెరుగుపడాలని, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు అభివృద్ధి చెందాలని, డిజిటల్ వనరులు అందుబాటులోకి రావాలని , విద్యార్థుల డ్రాప్అవుట్ తగ్గాలని, బోధనేతర పనిభారం తగ్గాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి అని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు ఐ. గంగాధర బాబు, ఎ. మహేశ్వర నాయుడు, నాయకులు ప్రమోద్ కుమార్ రెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

# అదృశ్యమైన బాలుడుని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



సిద్ధవటం ఆగస్టు 10(మనం న్యూస్) :సిద్దవటం పోలీస్ స్టేషన్ పరిధిలోని బొగ్గిడివారిపల్లి గ్రామం లో అదృశ్యమైన బాలుడు లివేశ్ రెడ్డి, వయసు 16 నెలలు ను సురక్షితంగా తల్లితండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు. 10 న సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు పోలీసు వారికి సమాచారము అందగా విస్తృతంగా గాలించి సాయంత్రము 4.15 నిమిషాలకు బాలుని గుర్తించి సురక్షితంగా అప్పగించడమైనది.వైయస్సార్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఒంటిమిట్ట సి.ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సర్కిల్ ఎస్.ఐ లు, సిబ్బంది తో విస్తృత గాలింపు చర్యలు..
అరటి తోటలో బాలుడిని గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు..
పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు..
ఒంటిమిట్ట సి.ఐ ఆధ్వర్యంలోని ఎస్.ఐ లు, సిబ్బంది ని అభినందించిన జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్

# ఐజిసి ఇంటర్ డైరెక్టొరేట్ షూటింగ్ ఛాంపియన్ షిప్లో అక్షయ పాల్గొనడం పాఠశాలకు గర్వకారణం

ప్రధానోపాధ్యాయులు బాలరాజు దుర్గరాజు,
ఎన్సిసి అధికారి పసుపుల రాజశేఖర్



చిట్వేలి ఆగస్టు10 మనం న్యూస్ ప్రతినిధి: పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిట్వేలికి చెందిన ఎన్సిసి క్యాడెట్ చెంజి అక్షయ పశ్చిమగోదావరి జిల్లా, ఆలంపూర్ సైనిక్ స్కూల్లో జరిగిన ప్రతిష్టాత్మకమైన ఐజిసి ఇంటర్ డైరెక్టొరేట్ షూటింగ్ ఛాంపియన్ షిప్ లో పాల్గొని పాఠశాలకు గర్వకారణంగా నిలిచిందనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు దుర్గరాజు, ఎన్సిసి ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ అక్షయను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్సిసిలో షూటింగ్ విభాగంలో ప్రతిభ కనబరిచిన అక్షయ వివిధ స్థాయిల్లో నిర్వహించిన ఎంపికల్లో ప్రతిభను ప్రదర్శించి ఐజిసి స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం సాధించిందనీ. ఈ ఎన్సిసి శిక్షణతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలే కాక, విద్యా, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునీ అన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలరాజు దుర్గరాజు, ఎన్సిసి అధికారి పసుపుల రాజశేఖర్, ఉపాధ్యాయుని సోఫియా, మొదలగు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం ఆపేది లేదు: మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు





?రైల్వేకోడూరు, ఆగస్టు 10, మనం న్యూస్
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు పట్టణంలోని స్థానిక రాజు కన్వెన్షన్ సెంటర్ నుండి వైసీపీ పార్టీ కార్యాలయం వరకు మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయి అంటూ ఈ యొక్క అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలంటూ మూడు రోజులుగా చేపిన నిరసన దీక్షలో భాగంగా సోమవారం వైయస్సార్సీపి నియోజకవర్గ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో భాగంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ విధమైన పద్ధతి, నిబంధనలు లేకుండా జీవోలు క్రియేట్ చేసి, నిరుద్యోగ యువత భవిష్యత్తు తో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ,శ్రమించి చదువుకున్న యువత ఈరోజు ఆందోళన బాట పట్టి, తీవ్ర నిరాశలో సూసైడ్ చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయని తెలియజేస్తూ, ?వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా రౌండ్ టేబుల్ సమావేశాల నుంచి రిలే నిరాహార దీక్షల వరకు అనేక పోరాట కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కోటిమందికి పైగా యువత, మేధావులు, క్యాడర్‌తో రాష్ట్రమంతా ఇదే పరిస్థితి నెలకొందని స్పష్టం చేశారు.

నిరుద్యోగ యువత ఎవరికీ భయపడలేదని, తమ హక్కులు కాపాడుకునేందుకు లాఠీ ఛార్జీలు, నిర్బంధాలకు సిద్ధపడి రోడ్లపైకి వచ్చారని చెప్పారు. ఈ పోరాటానికి ప్రజా సంఘాలు, మేధావులు, ఇతర రాజకీయ పార్టీలు కూడా మద్దతు తెలిపాయని అన్నారు. విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ తక్షణమే తమ బాధ్యతకు జవాబుదారీగా ఉంటూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేయకపోతే రాబోయే రోజుల్లో కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేరని హెచ్చరించారు. దేశంలో 'నీట్' పరీక్ష అక్రమాలపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయని, జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అక్రమాలు జరిగితే ముగ్గురు సభ్యులు రాజీనామా చేశారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో హక్కులు కోల్పోయినప్పుడు ప్రశ్నించడం, రోడ్డెక్కి పోరాడటం రాజ్యాంగం కల్పించిన హక్కని, న్యాయం అడిగిన వారిపై దాడులు చేయడం సరైంది కాదని కొరముట్ల శ్రీనివాసులు హితవు పలికారు.

ఈ కార్యక్రమానికి ఐదు మండలాల వైసిపి కన్వీనర్ లు చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, సాయి కిషోర్ రెడ్డి, ముస్తాక్, జడ్పీటీసీలు రామనాథం, రత్నమ్మ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుబ్బరామరాజు, కోడూరు పట్టణ అధ్యక్షుడు సిహెచ్ రమేష్, రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సుంకేసుల రఫీ మరియు మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు జడ్పీటీసీలు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు డైరెక్టర్లు పలు అనుబంధ సంఘాల అధ్యక్షులు జిల్లా కార్యదర్శులు, యువకులు విద్యార్థులు మరియు ఐదు మండలాల నుండి కార్యకర్తలు తదితరులు భారీగా పాల్గొన్నారు.

# విజయపథం " అమలుతో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

## ఏపీ కేజీబీవి కార్యదర్శి దేవానంద రెడ్డి



పెనగలూరు, (ఆగస్టు 10), మనం న్యూస్:
కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో విజయపథం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల కార్యదర్శి దేవానంద రెడ్డి సూచించారు.

సోమవారం ఆయన పెనగలూరు, చిట్వేలు, పుల్లంపేట, ఓబులవారిపల్లి కేజీబీవీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి విద్యా ప్రమాణాలు, బోధనా విధానం, వసతులు, భోజనం, పరిశుభ్రత తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీల్లో విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంపొందించి 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విజయపథం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంతో పాటు, ప్రతిరోజూ బోధించిన పాఠ్యాంశాలపై పరీక్షలు నిర్వహించి ఫలితాలను విశ్లేషించి విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ప్రత్యేక శిక్షణ అందించాలని సూచించారు.

విద్యార్థులను వారి సాధన ఆధారంగా ఉన్నతి (92--100 మార్కులు), ప్రగతి (65--89 మార్కులు), దీప్తి (40--64 మార్కులు), స్ఫూర్తి (0--39 మార్కులు) అనే నాలుగు గ్రూపులుగా విభజించి,

ప్రతి విద్యార్థి సామర్థ్యానికి అనుగుణంగా ప్రత్యేక బోధన పునశ్చరణ మరియు నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు ఆరోగ్యం, పోషకాహారం కూడా అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. కేజీబీవీల్లో విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత, పరిమాణం, రుచికరత, పరిశుభ్రత మరియు పోషక విలువలతో కూడినదిగా ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులకు సమతుల్య ఆహారం అందిస్తూ, వారి శారీరక, మానసిక ఆరోగ్యం మరియు ఏకాగ్రత పెంపొందేలా అవసరమైన పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలల్లో తాగునీరు, పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, యోగా, క్రీడలు మరియు ఆరోగ్యకరమైన జీవనశైలి అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

మౌలిక వసతులపై దృష్టి

పెనగలూరు కేజీబీవీలో ఇంటర్మీడియట్ బాలికల కోసం నూతనంగా నిర్మించిన భవనాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే అన్ని కేజీబీవీలకు త్వరలో అవసరమైన బంకర్ కాట్స్ లను అందజేయనున్నట్లు వెల్లడించారు.

తనిఖీలో భాగంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడి తరగతి గది బోధన, భోజనం, వసతులు, వసతి గృహ సౌకర్యాలు, పరిశుభ్రత మరియు ఇతర అవసరాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జీసీడీఓలు సబిహా సుల్తాన్, జయలక్ష్మి, పెనగలూరు ఎంఈఓ ఎం. గిరి వరదయ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ సుచరిత, సంబంధిత మండలాల ఎంఈఓలు, కేజీబీవీ ప్రిన్సిపాళ్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భోజనం చేసిన వెంటనే పండ్లు తినొచ్చా? నిపుణులు చెబుతోంది ఇదే..!



భోజనం ముగిసిన వెంటనే యాపిల్, బొప్పాయి.. ఇలా ఏదో ఒక పండు తినడం చాలా ఇళ్లలో అలవాటు. స్వీట్లకు బదులుగా పండ్లు తినడం ఆరోగ్యకరమనే భావనే అందుకు కారణం. అయితే భోజనం చేసిన వెంటనే పండ్లు తింటే కడుపులో అవి కుళ్లిపోతాయని, గ్యాస్ వస్తుందని, జీర్ణక్రియ దెబ్బతింటుందని సోషల్ మీడియాలో ఈ మధ్య ప్రచారం జరుగుతోంది. ఇందులో నిజమెంత? నిపుణుల ప్రకారం ఈ ప్రచారానికి శాస్త్రీయ ఆధారాలు లేవు. మన కడుపులో ఉండే ఆమ్లాల స్థాయి చాలా ఎక్కువగా ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో పండ్లు కుళ్లిపోవడం లేదా పులియడం జరగదని చెబుతున్నారు. భోజనం తర్వాత పండ్లు తింటే అవి కడుపులో కొంతసేపు ఎక్కువగా ఉండొచ్చు. కానీ అది సహజమైన జీర్ణ ప్రక్రియలో భాగమే తప్ప సమస్య కాదని వివరిస్తున్నారు. పండ్లలో ఉండే పీచు పదార్థం జీర్ణక్రియను కొద్దిగా నెమ్మదింపజేస్తుంది. దీంతో ఎక్కువసేపు కడుపు నిండిన భావన ఉంటుంది. మధ్యలో ఆకలి తగ్గుతుంది. అలాగే రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా కూడా సహాయపడుతుంది. మధుమేహం ఉన్నవారికి కూడా భోజనంతో పాటు లేదా తర్వాత పండ్లు తీసుకోవడం కొన్ని సందర్భాల్లో ప్రయోజనకరంగా ఉండొచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా ప్రోటీన్లు, ఆరోగ్యకర కొవ్వులు ఉన్న ఆహారంతో కలిపి పండ్లు తింటే రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా ఉండొచ్చు. అయితే అందరికీ ఒకే విధమైన అనుభవం ఉండదు. జీర్ణ సంబంధ సమస్యలు, ఐబీఎస్ వంటి ఇబ్బందులు ఉన్నవారికి భోజనం తర్వాత ఎక్కువ మొత్తంలో పండ్లు తింటే కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు రావచ్చు. అలాంటి వారు పండ్లను భోజనానికి ఒకటి లేదా రెండు గంటల తర్వాత తినడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు జామ, కివీ, నారింజ వంటి విటమిన్-సి ఎక్కువగా ఉండే పండ్లు భోజనంతో కలిపి తింటే శరీరం ఇనుమును మెరుగ్గా గ్రహిస్తుంది.

మొత్తంగా చూస్తే ఆరోగ్యవంతులైన చాలా మందికి భోజనం చేసిన వెంటనే పండ్లు తినడం వల్ల ఎలాంటి హాని ఉండదు. స్వీట్లు, చక్కెర ఎక్కువగా ఉండే డెజర్ట్‌లతో పోలిస్తే పండ్లు చాలా మెరుగైన ఎంపికగా నిపుణులు చెబుతున్నారు.

# డీఎస్సీపై రాజకీయ ప్రచారం మానుకోవాలి: ఐటీడీపి సాయి రాజు



వీరబల్లి మనం న్యూస్ ఆగస్టు 10: డీఎస్సీ నియామకాల అంశాన్ని రాజకీయ విమర్శలకు వేదికగా మార్చకుండా, నిరుద్యోగ యువత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాజంపేట ఐటీడీపి జనరల్ సెక్రటరీ సాయి రాజు కోరారు.

డీఎస్సీ పేరుతో వైసీపీ నాయకులు నిర్వహిస్తున్న ర్యాలీలపై ఆయన స్పందిస్తూ, గత ఐదేళ్ల పాలనలో రాజంపేట నియోజకవర్గానికి జరిగిన అభివృద్ధి, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులపై ప్రజలకు వివరాలు తెలియజేయాలని సూచించారు.

నిరుద్యోగ యువత భవిష్యత్తు ఎంతో ముఖ్యమైనదని, డీఎస్సీ విషయంలో అభ్యర్థుల్లో అనవసర ఆందోళనలు కలిగించే ప్రచారానికి దూరంగా ఉండాలని అన్నారు. అభ్యర్థులు ప్రభుత్వం, సంబంధిత శాఖలు విడుదల చేసే అధికారిక ప్రకటనలను మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజంపేట నియోజకవర్గంలో భూ వ్యవహారాలు, ఇసుక రవాణా తదితర అంశాలపై వచ్చిన ఆరోపణలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని, ప్రస్తుత ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి ఈ అంశాలపై తన వైఖరిని ప్రజలకు వివరించాలని కోరారు.

చంద్రబాబు--లోకేష్ నాయకత్వంలో యువతకు ప్రాధాన్యతలి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, రాజంపేట ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విద్య, ఉపాధి, యువతకు అవకాశాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాజంపేట అభివృద్ధికి కృషి రాజంపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీ చమ్మర్థి జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. చివరగా డీఎస్సీ అభ్యర్థులు ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని సాయి రాజు కోరారు.

# పండుగల ముందు పసిడికి రెక్కలు.. భారీగా పెరిగిన ధరలు

పండుగల సీజన్‌కు ముందు బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. పండుగ కొనుగోళ్లు ఊపందుకోవడం, అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు వెలువడటంతో ఇవాళ్టి ట్రేడింగ్‌లో ఈ విలువైన లోహాల ధరలు ఒక్కశాతం కంటే ఎక్కువగా లాభపడ్డాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో అక్టోబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర ఏకంగా రూ. 1,162 (0.76శాతం) పెరిగి, ఒక దశలో రూ. 1,52,982 గరిష్ఠ స్థాయిని తాకింది. చివరికి రూ. 1,080 పెరుగుదలతో రూ. 1,52,900 వద్ద ట్రేడ్ అయింది.

బంగారం కంటే వెండి ధర మరింత వేగంగా పెరిగింది. సెప్టెంబర్ సిల్వర్ ఫ్యూచర్స్ ఏకంగా 1.62శాతం అంటే రూ. 3,755 పెరిగి రూ. 2,35,221 ఇంట్రాడే గరిష్ఠానికి చేరింది. చివరికి రూ. 3,427 లాభంతో రూ. 2,34,893 వద్ద కొనసాగింది.పండుగ సీజన్ నేపథ్యంలో నగల కొనుగోళ్లు, పెట్టుబడుల డిమాండ్ పెరగడం ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, మార్కెట్లో కొత్తగా లాంగ్ పొజిషన్లు తీసుకోవడం కూడా ధరలకు మద్దతు ఇస్తున్నాయని వారు తెలిపారు.